క్లుప్తంగా

లబ్ధిదారులకు అందుబాటులో ఉండాలి

రొళ్ల: రేషన్ లబ్ధిదారులకు ఈనెల 15వ తేదీ వరకూ ఎఫ్‌పీ షాపు వద్దనే డీలర్లు అందుబాటులో ఉండి నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలని తహసీల్దార్ షేక్షావలి తెలిపారు. మండల వ్యాప్తంగా 26 ఎఫ్‌పీ షాపులు ఉండగా మొత్తం 11,650 రేషన్ లబ్ధిదారులు ఉన్నారన్నారు. సరుకుల పంపిణీలో అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్త మృతి



సంజీవప్ప మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

లేపాక్షి: లేపాక్షి పంచాయతీ పరిధిలోని బింగిపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త సంజీవప్ప బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు గుడ్డంపల్లి వేణురెడ్డితో పాటు మండల కన్వీనర్ నిస్సార్, వైస్ ఎంపీపీ అంజినరెడ్డి .. సంజీవప్ప మృతదేహం వద్ద నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అంత్యక్రియల కోసం రూ.10 వేలు ఆర్థిక సాయం చేశారు.

హెల్పర్‌పై చర్యలు తీసుకోండి



సీడీపీఓకు ఫిర్యాదు చేస్తున్న గ్రామస్తులు

చిలమత్తూరు: మండల పరిధిలోని చిన్నన్నపల్లిలో అంగన్వాడీ కేంద్రంలో హెల్పర్‌గా పని చేస్తున్న నంజమ్మపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు సీపీఎం నేతలతో కలిసి సీడీపీఓ వరలక్ష్మికి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సీడీపీఓ గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాన్ని బుధవారం తనిఖీ చేశారు. ఆమె వచ్చిన విషయాన్ని తెలుసుకున్న గ్రామస్తులు హెల్పర్ నంజమ్మ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండేళ్లుగా ఆమె మద్యం సేవించి అంగన్వాడీ కేంద్రానికి రావడం, పిల్లలు, గర్భిణులు, బాలింతల పట్ల అనుచితంగా ప్రవర్తిస్తోందన్నారు. వెంటనే ఆమెపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రగ్బీలో క్రీడాకారుల ప్రతిభ



ప్రశంసాపత్రాలతో విద్యార్థినులు

అమరాపురం: మండల పరిధిలోని హలుకూరు సమీపంలోని డాక్టర్ బీఆర్. అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలలో చదువుతున్న విద్యార్థినులు రగ్బీ పోటీల్లో ప్రతిభ కనబరచినట్లు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ అపర్ణ, పీడీ రోజా తెలిపారు. గత నెల 28 నుంచి 30 వరకూ కర్నూలులోని ఆదర్శ విద్యా మందిరం కళాశాలలో ఏపీ అంతర్ జిల్లాల రగ్బీ చాంపియన్‌షిప్ పోటీలు జరిగాయన్నారు. వివిధ జిల్లాల నుంచి 14 జట్లు పాల్గొనగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల అండర్– 18 జూనియర్ బాలికల జట్టు ఫైనల్ మ్యాచ్‌లో పాల్గొని, ద్వితీయ స్థానం దక్కించుకున్నట్లు పీడీ పేర్కొన్నారు. ప్రతిభ కనబరచిన విద్యార్థినులను ప్రిన్సిపాల్ అపర్ణ, ఉపాధ్యాయులు అభినందించారు.

ఆంగ్లం, కంప్యూటర్ పరిజ్ఞానం అవసరం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ ప్రగతి

హిందూపురం టౌన్: ప్రతి విద్యార్థికి కనీస ఆంగ్ల, కంప్యూటర్ పరిజ్ఞానం తప్పనిసరిగా ఉండాలని, తద్వారా మరింత మెరుగ్గా భవిష్యత్తులో రాణించగలుగుతారని ఎస్‌ఎస్‌పీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రగతి విద్యార్థులకు సూచించారు. డిగ్రీలో చేరిన ప్రథమ సంవత్సర విద్యార్థినుల కోసం స్థానిక ఎస్‌ఎస్‌పీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో నిర్వహించబోయే సర్టిఫికెట్ కోర్సులను బుధవారం ప్రిన్సిపాల్ ప్రారంభించారు.

కూలీల సంఖ్య పెంచండి

అమరాపురం: మండలంలో ఉపాధి హామి పథకం కింద పని చేయడానికి కూలీల సంఖ్యను పెంచాలని ఏపీడీ లక్ష్మీ నారాయణ అధికారులకు సూచించారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో ఆయన సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో కూలీలు తక్కువగా వస్తున్నారని, కూలీల సంఖ్యను క్షేత్ర స్థాయిలో అధికారులు పర్యటించి పెంచాలన్నారు. అలాగే మెట్ట భూముల్లో పండ్ల తోటల పెంపకంపై సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వమిచ్చే సబ్సిడీలను వివరించాలని సూచించారు. ఏపీఓ శివన్న, టీఏలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

కరుణించని వరుణుడు

- వర్షాల కోసం అన్నదాతల ఎదురు చూపు
- వేరుశనగ సాగుపై ఆందోళన



వేరుశనగ సాగుకు సిద్ధం చేసిన భూమి

మడకశిరరూరల్: వరుణుడు ముఖం చాటేయడంతో ఈ ఏడాది ఖరీఫ్‌లో పంటలను గడువులోగా సాగు చేస్తామో.. లేదోనని రైతుల్లో ఆందోళన మొదలైంది. భూమిని సిద్ధం చేసుకొని నెలరోజులకు పైన అవుతున్నా వర్షం లేకపోవడంతో దిక్కుతోచనిస్థితిలో పడ్డారు.

తగ్గనున్న వేరుశనగ సాగు

నియోజకవర్గంలో గత ఏడాది కన్నా సాగు విస్తీర్ణం ఈ ఏడాది తగ్గిపోయే అవకాశం ఉంది. గత ఏడాది మడకశిర, అగళి, రొళ్ల, అమరాపురం, గుడిబండ మండలాల్లో 18, 339 హెక్టారుల్లో వేరుశనగ పంట సాగు చేసి వర్షాభావ పరిస్థితుల కారణంగా తీవ్రంగా నష్టపోయారు. కానీ ఈ ఏడాది ఆర్థిక సమస్యలతో పాటు సాగుకు వర్షం రాకపోవడంతో రైతులు ఎదురు చూస్తున్నారు. వేరుశనగ పంట సాగు చేయడానికి జూన్ మాసంలోనే మంచి అదును. కానీ వర్షం జాడలేకపోవడంతో ఆగస్టు మెదటి వారం వరకూ వేరుశనగ పంటను సాగు చేసుకోవచ్చని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. కానీ జూలై 15 లోపు సాగు చేస్తే పంట దిగుబడి పెరుగుతుందని రైతులు అంటున్నారు. ఆ తర్వాత సాగు చేస్తే దిగుబడి తగ్గిపోతుందని చెబుతున్నారు.

1750 ఎకరాల్లో పంట

మడకశిర నియోజకవర్గంలో ఇప్పటి వరకూ దాదాపు 1,750 ఎకరాల్లో రైతులు వేరుశనగ పంటను సాగు చేశారు. పంట సాగు చేయక రైతులు ఆందోళనలో ఉంటే సాగు చేసిన రైతులు మొలకెత్తిన వేరుశనగ పంట ఎండిపోతుండటంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాంతంలో గాలి తీవ్రత పెరగడంతో మేఘాలు నిలబడటం లేదు. సకాలంలో వర్షాలు కురుస్తాయోలేదోనని రైతాంగంలో ఆందోళన మొదలైంది.

వర్షం కోసం ఎదురు చూస్తున్నా..



ఈ ఏడాది వేరుశనగ పంట సాగు కోసం అప్పులు చేసి రెండు ఎకరాల భూమి దున్ని దుక్కులు చేసి విత్తనాలు సిద్ధం చేసుకున్నాము. వర్షం కోసం ఎదురు చూస్తున్నాం. గత ఏడాది వేరుశనగ పంట సాగు చేసి అకాల వర్షాల కారణంగా పంట పొలంలోనే కుళ్లి పోయి తీవ్రంగా నష్టపోయాం. వారంలోపు పదునైనా వర్షం పడితే వేరుశనగ విత్తనాలు సాగు చేస్తాం.

– వెంకటేశ్, టీడీపల్లి, మడకశిర మండలం

గత ఏడాది నష్టపోయాం



గత ఏడాది అప్పులు చేసి వేరుశనగ పంట సాగు చేశాం. విస్తారంగా వర్షాలు కురవడంతో తొలగించిన వేరుశనగ పంట పొలంలోనే తడిసి కుళ్లి పోయి తీవ్రంగా నష్ట పోయాం. ఈ ఏడాది అదునులోపు వర్షం వస్తే వేరుశనగ పంట సాగు చేస్తాం. జూలై 15 తర్వాత వర్షం వస్తే పంట సాగు చేస్తే పంటకు తెగుళ్ల వ్యాప్తి ఉంటుంది. దిగుబడి కూడా తగ్గుతుంది. దీంతో విత్తనాలను అమ్ముకుని ప్రత్యామ్నాయ పంటలను సాగుపై మొగ్గు చూపాల్సి ఉంటుంది.

– మల్లికార్జున, కేతేపల్లి, మడకశిర మండలం

అక్రమ కేసులకు భయపడను



మట్లాడుతున్న మంజునాథ్

మడకశిర: కూటమి ప్రభుత్వం పెట్టే అక్రమ కేసులకు తాను భయపడబోనని మడకశిర మండలం గుండుమలకు చెందిన సోషల్ మీడియా కార్యకర్త మంజునాథ్ అన్నారు. ఆయన బుధవారం 'సాక్షి'తో మాట్లాడుతూ తనపై కూటమి నాయకులు తప్పుడు కేసులు బనాయించి జైలుకు పంపారని పేర్కొన్నారు. అయినా భయపడే ప్రసక్తే లేదన్నారు. వైఎస్ జగన్ వెంటే నడుస్తానని తేల్చిచెప్పారు. కూటమి ప్రభుత్వ అన్యాయాలను ప్రశ్నించడమే తప్పా అని ప్రశ్నించారు. తనపై పోలీసులు కేసు నమోదు చేసినప్పటి నుంచి బెయిల్ వచ్చే వరకూ స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు అండగా నిలబడ్డారని పేర్కొన్నారు.

ప్రతి మహిళా పారిశ్రామికవేత్తగా ఎదగాలి



మహిళా సంఘాలకు చెక్కు పంపిణీ చేస్తున్న మంత్రి సవిత

పెనుకొండ రూరల్: ప్రతి మహిళా పారిశ్రామికవేత్తగా ఎదగాలని బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. వెలుగు కార్యాలయం ఏర్పాటు చేసి 25 వసంతాలు పూర్తి చేసుకొన్న సందర్భంగా కార్యాలయంలో కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా మంత్రి కమ్యూనిటీ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్ చెక్కులను, పొదుపు సంఘాలకు చెక్కులను పంపిణీ చేశారు. పీడీ నరసయ్య, ఏపీఎం రవిచంద్ర, తదితరులు పాల్గొన్నారు.

వంతెన నిర్మాణం ప్రారంభం

గోరంట్ల: మండల పరిధిలోని బూదిలి సమీపంలో చిత్రావతి నదిపై రూ.8.52 కోట్ల వ్యయంతో నిర్మించనున్న వంతెన నిర్మాణానికి మంగళవారం మంత్రి సవిత భూమి పూజ చేశారు. అనంతరం వానవోలు పంచాయితీ పరిధిలోని కొలమిపల్లిలో నిర్వహించిన తొలి అడుగు కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు.

బాబు దగాకోరు హామీలను ప్రజలకు వివరిస్తాం



పోస్టర్లను విడుదల చేస్తున్న మాజీ మంత్రి ఉషశ్రీచరణ్, నాయకులు

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్

సోమందేపల్లి: ఎన్నికల ముందు అధికారంలోకి రావడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రజలకు దగాచేస్తున్నారని మాజీ మంత్రి వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ తెలిపారు. బుధవారం సోమందేపల్లిలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద బాబూ ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ పోస్టర్లను ఆవిష్కరించారు. ఉషశ్రీచరణ్ మాట్లాడుతూ సూపర్ సిక్స్‌తో పాటు ఎన్నో హామీలు గుప్పించి.. సీఎం అయ్యాక ఏ ఒక్కటి పూర్తిస్థాయిలో అమలు చేయడం లేదన్నారు. 50 ఏళ్లకే వృద్ధాప్య పింఛన్, నిరుద్యోగ భృతి రూ.3 వేలు, ఆడపిల్ల నిధి కింద నెలకు రూ.1500, ఉచిత బస్సు లాంటి హామీల ఊసే లేదన్నారు. అలాగే బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత మహిళలకు, చేనేతలకు చేసిన మేలు ఏంటో చెప్పాలన్నారు. గతంలో చేనేతలకు రూ.24 వేలు నేతన్న నేస్తం ఇస్తే కూటమి ప్రభుత్వం పథకాన్ని రద్దు చేసి వారిని మోసం చేసిందన్నారు. వివిధ అక్రమ కేసుల్లో న్యాయస్థానాలు ప్రభుత్వానికి మొటిక్కాయలు వేశాయని పేర్కొన్నారు. ఏడాది పూర్తయినా హామీలు అమలు చేయకుండా కూటమి నాయకులు సుపరిపాలన అంటూ ఇంటింటికీ వెళ్లడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రజలు తిరుగుబడే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్లు గజేంద్ర, శ్రీనివాసులు, జెడ్పీటీసీ అశోక్, వైస్ ఎంపీపీ వెంకటనారాయణరెడ్డి, వైస్ సర్పంచ్ వేణు, సర్పంచ్‌లు అంజినాయక్, పరంధామ, కిష్టప్ప, వైఎస్సార్‌సీపీ నాయకులు నరసింహమూర్తి, ఆదినారాయణరెడ్డి, మంజు, జితేంద్రరెడ్డి, శ్రీరాములు, ఇమామ్‌వలీ, నాగమణి, శ్రీకాంత్, రామాంజి, నాగమణి, గోవిందరెడ్డి, ప్రతాప్, ఈశ్వర్, కళ్యాణ్, మారుతి, అయూబ్ తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు పరామర్శ

పట్టణంలోని దర్గాపేటకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు ఇస్మాయిల్ భార్య షాహిదా ఇటీవల ప్రమాదంలో గాయపడింది. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ బాధితురాలి నివాసానికి చేరుకొని పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం మైనార్టీ నాయకుడు ఖాజపీర్ సోదరుడు బాషా అనారోగ్యంతో ఇంట్లో విశ్రాంతి తీసుకుంటుండటంతో ఆయన్ను కూడా పరామర్శించారు. ఆమె వెంట వైఎస్సార్‌సీపీ వాల్మీకి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పొగాకు రామచంద్ర, పట్టణ కన్వీనర్ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

సేవే మార్గం.. ప్రేమే లక్ష్యం కావాలి



పాస్టర్స్ ఫెలోషిప్ సందర్భంగా సభ్యులను సన్మానిస్తున్న దృశ్యం

హిందూపురం: సూగురు బేతేలు పెంతికోస్ట్ చర్చ్‌లో బుధవారం హిందూపురం పాస్టర్స్ ఫెలోషిప్ సిల్వర్ జూబ్లీ కార్యక్రమం ఘనంగా జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన బెంగళూరు బాబీ అబ్రహాం మాట్లాడుతూ.. దైవసేవకులు కలిసికట్టుగా ముందుకు కొనసాగుతూ యేసుక్రీస్తు చూపిన మార్గంలో నడవాలన్నారు. సేవే మార్గం ప్రేమే లక్ష్యంగా కల్గి ఉండాలన్నారు. అనంతరం ఫెలోషిప్ పాస్టర్లు మాట్లాడుతూ సేవకులను బలపరుస్తూ సంఘాలకు సహాయకరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఫెలోషిప్ వ్యవస్థాపకులు అధ్యక్షులు డేవిడ్‌రాజు, వైస్ ప్రెసిడెంట్ ఎస్ యేసురత్నం, సెక్రటరీ జయరాజ్, కోశాధికారి విజయకుమార్, ఉప కోశాధికారి కారి పాస్టర్‌జేమ్స్, జాయింట్ ట్రెజరర్ సజీవ రావ్, లైఫ్ వైరల్డ్ చారిటబుల్ ట్రస్ట్ ఉదయ్ కుమార్, మాజి కౌన్సిలర్ రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

టీకాలు వందశాతం పూర్తి చేయాలి



జాతీయ డెంగీ మాసోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌ఓ ఫిరోజా బేగం

మడకశిర: నియోజకవర్గంలో గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు, చిన్నారుల వ్యాధి నిరోధక టీకాలను వందశాతం పూర్తి చేయాలని డీఎంహెచ్ఎం ఫైరోజాబేగం తెలిపారు. ఆమె బుధవారం పట్టణంలోని అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. అలాగే నియోజకవర్గంలోని పీహెచ్‌సీల డాక్టర్లు, సూపర్ వైజర్లు తదితర సిబ్బంది సమావేశమై వివిధ అంశాలపై సమీక్షించారు. అనంతరం జాతీయ డెంగీ మాసోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అన్ని కాన్పులు ప్రభుత్వాస్పత్రిలోనే జరిగే విధంగా చూడాలన్నారు. ఆరోగ్య గుర్తింపు కార్డులు పూర్తి స్థాయిలో అందించాలన్నారు. అసిస్టెంట్ మలేరియా అధికారి లక్ష్మీనాయక్ , డీపీఎంఓ నాగేంద్రనాయక్, డీపీఓ ఎన్‌హెచ్ఎం నాగరాజు పాల్గొన్నారు.

ధర్నా విజయవంతం చేయండి



మాట్లాడుతున్న ఏపీ పీటీడీ నాయకులు

హిందూపురం: ఏపీపీటీడీ యూనియన్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా జూలై 4, 5 తేదీల్లో నిర్వహించే ధర్నాను విజయవంతంచేయాలని ఎంప్లాయీస్ రీజినల్ నాయకులు నారాయణస్వామి, బాబయ్య తెలిపారు. వారు మాట్లాడుతూ ఆర్టీసీలో చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను యాజమాన్యం స్పందించి వెంటనే పరిష్కరించాలన్నారు. 30 డిమాండ్ల సాధన కోసం నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో డిపో కార్యదర్శి మల్లికార్జున, సీనియర్ నాయకులు ప్రసాద్, నాగరాజు, హనుమంతరెడ్డి, లక్ష్మమ్మ, రమేష్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

చాముండీదేవిగా సప్తమాతృక అమ్మవారు



పరిగి: మండల కేంద్రంలోని సప్తమాతృక ఆలయంలో ఆషాఢ గుప్త నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు శ్రీచాముండీదేవి అలంకరణలో బుధవారం భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు ప్రవీణ్‌కుమార్, శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సంక్షిప్త సమాచారం

5న మెగా లోక్‌అదాలత్

రొళ్ల: మడకశిర కోర్టు ఆవరణలో ఈనెల 5న నిర్వహించనున్న మెగాలోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎస్ఐ వీరాంజనేయులు తెలిపారు. రాజీకాదగిన కేసులను పరిష్కరించడం జరుగుతుందన్నారు.

విచక్షణా రహితంగా ఎరువులు వాడొద్దు

అగళి: వివిధ రకాల పంటల్లో మోతాదుకు మించి రసాయన ఎరువులను వినియోగించవద్దని ఏఓ నాగరాజు సూచించారు. బుధవారం మండల పరిధిలోని హెచ్‌డీహళ్లి , తండా, పి బ్యాడగేర ,కేంకర గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు, సలహాలిచ్చారు.

పంటల బీమా పథకానికి నమోదు చేసుకోండి

హిందూపురం: హిందూపురం డివిజన్‌లోని రైతులు పంటల బీమాను ఈనెల15వ తేదీలోపు నమోదు చేసుకుని పంటలకు బీమా రక్షణ పొందాలని ఏడీఏ అల్తాఫ్ అలీఖాన్ తెలిపారు. వేరుశనగ పంటల బీమా కోసం ఎకరాకు రూ.648 చెల్లించి ఇన్సూరెన్స్ పొందాలని కోరారు.

గురుపౌర్ణమి వేడుకలను విజయవంతం చేయండి

మడకశిర: పట్టణంలోని షిరిడీ సాయిబాబా ఆలయంలో ఈనెల 9, 10న నిర్వహించే గురుపౌర్ణమి వేడుకలను భక్తులు విజయవంతం చేయాలని విశ్రాంత డీఎస్పీ, ఆలయ ట్రస్ట్ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. వేడుకల ఏర్పాట్లపై మంగళవారం రాత్రి ఆలయంలో పట్టణ ప్రముఖుల సమావేశాన్ని నిర్వహించి చర్చించినట్లు పేర్కొన్నారు.

నేడు పోస్టర్ల ఆవిష్కరణ

గోరంట్ల: మండల కేంద్రమైన గోరంట్లలో బుధవారం వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ ఆధ్వర్యంలో రీకాలింగ్ చంద్రబాబు పోస్టర్లను ఆవిష్కరిస్తున్నట్లు మండల కన్వీనర్ వెంకటేష్, పట్టణ కన్వీనర్ మేదర శంకర తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

గుడిబండ: రైతుల భూసమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని తహసీల్దార్ శ్రీధర్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సిబ్బందితో తహసీల్దార్ సమీక్ష సమవేశం నిర్వహించారు. డైక్లాట్ ఆధారంగా అర్హత ఉన్న రైతులకు కొత్తగా పట్టదారు పాసుపుస్తకాలు మంజూరు చేస్తాన్నారు.

వరకట్నం కేసు నమోదు

హిందూపురం: పట్టణంలోని మేళాపురంలో కాపురం ఉంటున్న తాబసుమ్ తన భర్త చంద్‌బాషా అదనపు కట్నం కోసం వేధిస్తున్నాడని బుధవారం వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. త్యాగరాజనగర్‌కు చెందిన తాబసుమను రెండేళ్ల క్రితం మేళాపురంలోని చాంద్‌బాషాకు ఇచ్చి వివాహం చేశారు. వివాహం సమయంలో కట్నకానుకలు ఇచ్చారు. అయితే ఇప్పుడు మరింత కట్నం కావాలని వేధిస్తుడని ఆమె పోలీసులతో వాపోయింది.పోలీసులు వరకట్నం వేధింపు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు ప్రైవేటు పాఠశాలల బంద్

అమరాపురం: రాష్ట్ర ప్రైవేటు పాఠశాలల అసోషియేషన్ పిలుపు మేరకు గురువారం ప్రైవేటు పాఠశాలలను బంద్ చేయనున్నట్లు మండల ప్రైవేటు పాఠశాలల అధ్యక్షుడు ఖలీల్, తిప్పేస్వామి తెలిపారు. ప్రైవేటు పాఠశాలలు ఎదుర్కొంటున్న సమస్యలపై బంద్ చేస్తున్నట్లు పేర్కొన్నారు.

మొహర్రం వేడుకలు ప్రారంభం



వెంకటరెడ్డిపల్లిలో కొలువుదీరిన పీర్లు

పెనుకొండ: పెనుకొండ నగర పంచాయతీ పరిధిలోని వెంకటరెడ్డిపల్లి గ్రామంలో మొహర్రం వేడుకలు ప్రారంభమయ్యాయి. సోమవారం 9 నాళ్ల పర్వదినంగా కాగా మంగళవారం జల్దీ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. స్వామి పీర్ల వేడుకలు ప్రారంభమై 296 సంవత్సరాలు అవుతోందని ముల్లాసాబ్ ఖాసీం, కుర్రం సాబ్ తెలిపారు.

ముగిసిన నామినేషన్ల పర్వం

పావగడ: స్థానిక ఎస్ఎస్‌కే (శనిమహాత్మ కార్య నిర్వాహక) సంఘం ఎన్నికలకు సంబంధించి ఆ సంఘం మీటింగ్ హాల్‌లో నిర్వహించిన నామినేషన్ల పర్వం బుధవారం ముగిసింది. ఎన్నికలు జరిగే 15 డైరెక్టర్ స్థానాలకు 44 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసినట్లు ఎన్నికల అధికారి పీఎస్ సోమసుందర్ తెలిపారు. ఇదిలా వుంటే గతంలో పదవుల్లో ఉన్న 15 మంది పదాధికారులు, డైరెక్టర్లు సైతం నామినేషన్లు దాఖలు చేశారు. 3న నామినేషన్ల పరిశీలన, 6న నామినేషన్ల ఉప సంహరణ, 7న అభ్యర్థులు ప్రకటన ప్రక్రియలు నిర్వహిస్తామని, 13న ఎన్నికలు నిర్వహిస్తామని ఎన్నికల అధికారి అన్నారు.

బదిలీపై ఉపాధ్యాయులకు సన్మానం

మడకశిరరూరల్: పట్టణ పరిధిలోని వడ్రపాళ్యం ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయురాలు సుజాత బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా బుధవారం ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు ఆమెను శాలువాలతో కప్పి ఘనంగా సన్మానించారు. పాఠశాల అభివృద్ధికి ఆమె ఎంతగానో కృషి చేశారని గుర్తు చేశారు.

లేపాక్షి: మండలంలోని కొండూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8 సంవత్సరాలుగా పనిచేసి బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులు ఎల్ఆర్.గోపీ, అనీల్‌కుమార్, జగదీష్, అశోక్‌బాబు, శంకర్, భద్రయ్య, విశ్వనాథ్‌బాబును పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శేషగిరిబాబు ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పెండింగ్ జీతాలు చెల్లించండి



మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వినోద్ కుమార్

హిందూపురం టౌన్: పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఆయాలుగా పనిచేస్తున్న వారికి పెండింగ్‌లో ఉన్న నాలులు నెలల జీతాలను వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వినోద్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పట్టణంలోని ఎంజీఎం పాఠశాలలో ఏఐటీయూసీ అనుబంధ స్కూల్ ఆయాలు, స్వీపర్స్ యూనియన్ సభ్యులు సమావేశం నిర్వహించారు. జీతాలు వెంటనే చెల్లించకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు.

ముగిసిన సర్పంచుల శిక్షణ

మడకశిర: పట్టణంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం మహిళా సర్పంచుల శిక్షణ తరగతులు ముగిశాయి. ఆర్‌జీఎస్ఏ కార్యాచరణ ప్రణాళికపై మహిళా సర్పంచులకు మూడు రోజుల పాటు శిక్షణ ఇచ్చారు. శిక్షణ తరగతుల్లో ఎంపీడీఓ సోనిబాయి, కార్యాలయ పర్యవేక్షకుడు శ్రీనివాసులు, రీసోర్స్‌పర్సన్లు, పంచాయతీ రాజ్‌శాఖ అధికారులు పాల్గొన్నారు.


5న జగన్నాథ రథయాత్ర



మాట్లాడుతున్న ఇస్కాన్ సభ్యులు

హిందూపురం టౌన్: హరే కృష్ణ మూమెంట్ ఇస్కాన్ హిందూపురం ఆధ్వర్యంలో ఈ నెల 5న తలపెట్టిన జగన్నాథ రథయాత్రను భక్తులు విజయవంతం చేయాలని హిందూపురం ఇస్కాన్ కార్యదర్శి గోవింద చరణ్‌దాస్ పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. పట్టణంలోని పాలిటెక్నిక్ కళాశాల వద్ద ఉన్న హరే కృష్ణ టెంపుల్ ల్యాండ్ వద్ద నుంచి 5న శనివారం మధ్యాహ్నం 3.30 గంటలకు రథయాత్ర ప్రారంభమవుతుందన్నారు. బెంగళూరు ఇస్కాన్ నుంచి జగన్నాథ, బలదేవ, సుభద్రదేవి విగ్రహాలతో కూడిన 32 అడుగుల మహా రథం రానున్నట్లు పేర్కొన్నారు.

నిఘా



మద్యం సేవిస్తున్న వారి వద్దకు వెళ్లి హెచ్చరిస్తున్న పోలీసులు

పెనుకొండ: మండలంలో పోలీసులు డ్రోన్ కెమెరాల సాయంతో అసాంఘిక కార్యకలాపాలపై దృష్టిసారించారు. బుధవారం ఎస్ఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మండల పరిధిలో బహిరంగంగా మద్యం సేవిస్తున్న వారితో పాటు జూదమాడుతున్న వారిని అదుపులోకి తీసుకున్నారు.

నిరీక్షణ



వర్షం పడుతున్నా రేషన్ కోసం క్యూ లైన్‌లో నిల్చున్న లబ్ధిదారులు

చిలమత్తూరు: కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి రేషన్ లబ్ధిదారులకు ఏదో ఒక రూపంలో కష్టాలు ఎదురవుతున్నాయి. బుధవారం సాయంత్రం మండల కేంద్రంలో జోరువాన కురిసింది. వర్షంలో కూడా గంటల తరబడి నిల్చొని లబ్ధిదారులు రేషన్ తీసుకున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇంటి వద్దకే సరుకులు వచ్చేవని, ఇప్పుడు పడరాని ఇబ్బందులు పడుతున్నామని లబ్ధిదారులు వాపోతున్నారు.

నిర్లక్ష్యం



ఇందిరమ్మకాలనీలో రోడ్డుపై నిలిచివున్న మురుగు నీరు

అగళి: సరైన డ్రైనేజీ వ్యవస్థ లేక రోడ్లు మురుకి నీటి కాలువలుగా మారుతున్నాయి. మండల పరిధిలోని కదిరేపల్లి గ్రామంలోని ఇందిరమ్మ కాలనీలో డ్రైనేజీ , రోడ్ల వ్యవస్థ లేక ఇళ్ల నుంచి వచ్చే నీరు, కొళాయి నీళ్లు, వర్షం నీరు రోడ్లపైనే నిలబడుతున్నాయి. దీంతో రోడ్డు బురదమయంగా, గుంతలమయంగా మారి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నట్లు ప్రజలు వాపోతున్నారు.